క్లుప్తంగా

ఎండీఎం నిర్వహణపై ఫిర్యాదు



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

సారవకోట: మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందజేస్తున్న భోజనాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని ఎంఈఓ రమణకు అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఫిర్యాదు చేశారు. పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలకు హాజరైన ఎంఈఓకు విద్యార్థుల సమస్యలను వివరించారు. భోజనం రుచిగా లేకపోవడంతో విద్యార్థులు ఇక్కడ తినేందుకు ఇష్టం లేక ఇంటి వద్ద నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారని అన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్ఎం రామారావు, ఎంఈఓ-2 భూలక్ష్మి ఉన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన



పోస్టల్ స్కీమ్‌లు గురించి వివరిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

సరుబుజ్జిలి: పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న స్కీములు, సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ఆఫ్ పోస్టాఫీస్ (ఏఎస్పీ) ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పురుషోత్తపురం సబ్‌పోస్టాఫీస్‌లో ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు అధ్యక్షతన డాక్ చౌపల్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తపాలాశాఖ అందిస్తున్న పొదుపు, ఐపీబీపీ, జీవిత బీమా పథకాల వల్ల కలిగే ప్రయోజనాలు గురించి ప్రజలకు వివరించారు. సబ్‌పోస్ట్‌మాస్టర్ మురళీమోహనరావు, సిబ్బంది గణపతిరావు, వంశీ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

నరసన్నపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పంద్రాగస్టు సందడి మొదలైంది. స్కూళ్లల్లో వివిధ ఆటల పోటీలు గురువారం నుంచి నిర్వహిస్తున్నారు. సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ వంటి పోటీలు నిర్వహించారు. వీటిని హెచ్ఎం వకులాదేవి ప్రారంభించారు. గెలిపొందిన విద్యార్థులకు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు పంపిణీ అందజేస్తామని హెచ్ఎం తెలిపారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెరగాలి



రోగులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

హిరమండలం: పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. చొర్లంగి పీహెచ్‌సీని గురువారం సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం వచ్చేవారి విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. గిరిజనుల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలని సూచించారు. వైద్యులు, ఐటీడీఏ సిబ్బంది ఉన్నారు.

వెదుళ్లవలసలో మళ్లీ డయేరియా



చికిత్స పొందుతున్న శంకరరావు

ఆమదాలవలస: మండలంలోని వెదుళ్లవలసలో గురువారం మరో డయేరియా కేసు నమోదైంది. ఆ గ్రామానికి చెందిన ఎ.శంకరరావు డయేరియాతో బాధపడుతూ ఆమదాలవలస అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. గత నెలలో వెదుళ్లవలసకు చెందిన బత్తుల లక్ష్మణరావు (బుజ్జి) డయేరియాతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన మృతి తరువాత గ్రామంలో మరికొన్ని కేసులు నమోదై తగ్గుముఖం పట్టాయి. తాజాగా మరో కేసు నమోదు కావడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

వ్యాధులకు నిలయం



పాతపట్నంలోని గణేష్‌నగర్‌లో మురుగునీటి గుంత

- ఖాళీ స్థలాలు, రోడ్లపై మురుగునీరు నిల్వ
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- రోగాల బారిన ప్రజలు
- ఆస్పత్రుల కిటకిట

పాతపట్నం: అసలే వ్యాధుల కాలం. ఆపై ఎక్కడికక్కడ మురుగునీటి గుంతలు, పారిశుద్ధ్యలోపం వెరసి ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. వర్షం పడితే మురుగునీరు మరింత చేరుతుంది. ఈ నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నిల్వ అయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. కాలువలతో ఈ మురుగు గుంతలను అనుసంధానం చేసి నీరు లేకుండా చేయాలని పాతపట్నం మేజర్ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. 20 వేల జనాభా నివసిస్తున్నారు. నరసింహనగర్,



పాతపట్నం సీహెచ్‌సీలో ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

గణేష్‌నగర్, ఆల్ఆంధ్రా రోడ్డు, యశోదనగర్, కిరణ్మయి వీధి, అమ్మవారి కాలనీ, ఇందిరమ్మకాలనీ, బలాజీనగర్, పట్టణ శివారులో ఉన్న నూతన లేఅవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాలు అధికంగా ఉన్నాయి. వీటన్నింటిలోనూ మురుగునీరు నిల్వ ఉంటుంది.

జ్వరపీడుతులు అధికం..

పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 160 ఓపీ ఉంటే.. అందులో 50 మందివరకు జ్వరలతో బాధపడుతున్నవారు వస్తున్నారు. వీరిలో పట్టణవాసులు సగానికి పైగా ఉంటున్నారని వైద్యులు అంటున్నారు.

ఇబ్బందిగా ఉంది



ఖాళీ స్థలాల్లో పరిసర గృహాలకు చేందిన మురుగునీరు చేరుతుంది. లోతట్టు కావడంతో నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో నీరు నిల్వ అయి ప్రమాదకరంగా ఉంది. యశోధనగర్, నరహింహనగర్, శివర వీధుల్లో పలు ఖాళీ స్థలాల్లో ఇదే సరిస్థితి నెలకొంది. దోమల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి.

– పెద్దింటి నాగేసు, నర్సింహనగర్, పాతపట్నం

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ తరచూ వేయాలి. వర్షాలు కురియడంతో మురుగు నీటిలో బాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెందుతాయి. ఆస్పత్రికి ఎక్కువగా జ్వరం, విరోచనాలతో ఇబ్బందిపడేవారు వస్తున్నారు. తాగునీటిని మరిగించి వడబోసి తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– జి.వేణుగోపాల్, వైద్యుడు, సీహెచ్‌సీ ఆస్పత్రి, పాతపట్నం

క్రమశిక్షణ అవసరం



వసప కేజీబీవీలో మాట్లాడుతున్న జడ్జి రాణి

కొత్తూరు: విద్యతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె.రాణి అన్నారు. కొత్తూరులోని కేజీబీవీ, ఏకలవ్య పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహాలను గురువారం సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న మెనూను పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో ఫిజిక్స్, బోటనీ అధ్యాపకులు లేరని విద్యార్థులు తెలియజేశారు. జడ్జి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. న్యాయవాదులు ఎం.అప్పారావు, వి.సుధాకరరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



నరసన్నపేట: పోతయ్యవలసలో ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను అభినందిస్తున్న గ్రామస్తులు

నరసన్నపేట: మండలంలో 82 పాఠశాలలున్నాయి. 74 చోట్ల స్కూల్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 8 చోట్ల ఎన్నిక నిర్వహించారు. బాడాం ఉన్నత పాఠశాలల్లో చిన్న గర్షణ వాతావరణం నెలకొనగా ఎస్ఐ అశోక్‌బాబు బందోబస్తు నిర్వహించి ప్రశాంతంగా ఎన్నికల జరిపించారు. గోపాలపెంట, పోతయ్యవలస, తెలగవలస, ముద్దాడపేట స్కూళ్లల్లో విద్యా కమిటీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతురాలు ఎన్నికయ్యారు. దేశవానిపేట, బాడాంల్లో ఎన్నికైన కమిటీ సభ్యులతో ఎంఈఓ దాలినాయుడు, శాంతారావు ప్రతిజ్ఞ చేయించారు.

సారవకోట: మండలంలోని 79 ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. సారవకోట, అలుదు, బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోలీసుల బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించారు. సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ పదవి కోసం టీడీపీకి చెందిన వారే ఇద్దరు పోటీ పడ్డారు. మిగిలిన చోట్ల ఎటువంటి సమస్య లేకుండా ఎన్నికలు జరిగినట్లు ఎంఈఓ రమణ తెలిపారు.

పోలాకి: మండలంలో 95 పాఠశాలు ఉన్నాయి. 94 చోట్ల ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకున్నారు. ఈదులవలస ఏపీ మోడల్‌స్కూల్‌లో టీడీపీ నాయకుల రాజకీయ ఎత్తుగడ సాగలేదు. 473 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాల్సి ఉంది. కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. ధీర్ఘాశి పంచాయతీ కింజరాపుపేటలో డమ్మీ సంతకాలతో టీడీపీ నాయకులు కోరం సిద్ధం చేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతోపాటు, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

జలుమూరు: మండలంలోని మొత్తం 82 పాఠశాలలకు 38 చోట్ల ఎన్నికలు ఏకగ్రీమయ్యాయి. 44 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. పలు పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు ఉపాధ్యాయులపై ఆ పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 43 పాఠశాలల్లో కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతోపాటు ఇతర సభ్యుల ఎన్నికలు జరిగాయని ఎంఈఓలు మణికుమార్, చంద్రమౌళిలు తెలిపారు. కోరంలేక యంబరాం, చింతలబడవంజ ప్రాథమికోన్నత పాఠశాలలు, పూశాం, లక్ష్మీనర్సుపేట గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

హిరమండలం: మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 49 పాఠశాలల్లో ఎంఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమైట్లు ఎంఈఓ రాంబాబు తెలిపారు. ఏడుచోట్ల ఎన్నిక నిర్వహించినట్లు చెప్పారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత, గొట్టా ప్రాథమికోన్నత, ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదాపడ్డాయన్నారు.

పాతపట్నం: మండలంలోని 84 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. 16 చోట్ల ఎస్ఎంసీ ఎన్నికల్లో పోటీ పడ్డారు. 68 చోట్ల ఏకగ్రీవం జరిగాయని ఎంఈఓ బి.శ్రీధర్ తెలిపారు. సీది, కొరసవాడ, కేజీబీవీ, అంబేడ్కర్ గురుకులం, ప్రభుత్వ మోడల్ స్కూల్, రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చైర్మన్‌కు, వైస్ చైర్మన్‌కు పోటీ జరిగిందని అన్నారు.

పొందూరు: మండలంలోని 69 పాఠశాలలున్నాయి. 44 చోట్ల ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. తానేం పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. రాపాక గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య చైర్మన్ పదవికి పోటీ జరిగింది. టీడీపీ విజయం సాధించింది. లచ్చయ్యపేటలో ఉదయం 12 గంటల వరకు ఎన్నికల ప్రారంభం కాలేదు. పోలీసుల సమక్షంలో ఎన్నిక నిర్వహించారు.

కొత్తూరు: మండలంలోని 89 పాఠశాలున్నాయి. 51 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ గోవిందరావు తెలిపారు. 36 పాఠశాలల్లో కమిటీలను ఎన్నుకొన్నారు. కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల, మెట్టూరు బిట్-1 ఎంపీపీ పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈఓ చెప్పారు.

ఆమదాలవలస: మండలం, మున్సిపాలిటీల్లో 99 పాఠశాలలున్నాయి. 95 పాఠశాలల్లో ఎంఎస్‌సీ ఎన్నికలు జరిగాయి. నాలుగు చోట్ల ఎన్నికలు వాయిదా వేశారు. మున్సిపాలిటీ పరిధి అక్కివలస మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, మండలంలోని బొబ్బిలిపేట, సంతకొత్తవలస, వంజంగి పాఠశాలల్లో ఎన్నికలు నిలిచిపోయాయని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్‌తెలిపారు.

సరుబుజ్జిలి: మండలంలో 53 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 40 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగాయి. 7 పాఠశాలల్లో ఎన్నిక నిర్వహించారు. 6 పాఠశాలల్లో వాయిదా వేసినట్లు ఎంఈఓ డి.బాలరాజ ప్రకటించారు.

నీలమణి అమ్మవారికి ప్రత్యేక పూజలు

జలుమూరు: పెద్దదూగాంలో నీలమణి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు: మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. తల్లికి వందనం పథకాన్ని రాష్ట్రంలో కచ్చితంగా అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపీటీసీ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను భాగస్వామ్యం చేయాలి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పోలాకి: పంద్రాగస్టు వేడుకల్లో ప్రజలను భాగస్వామ్యం చేసేలా పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం పోలాకిలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం సమావేశం నిర్వహించారు. ఇంటింటా జెండా ఎగురవేసే కార్యక్రమం జరగాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ఆమదాలవలస: మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులు బ్యాంక్‌ల వద్ద తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. పొదుపు చేసిన మొత్తం నుంచి సభ్యురాలి అవసరం మేరకు అప్పు తీసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల్లో అర్హులందరికీ ఉన్నతి నుంచి రుణాలు ఇప్పించాలని ఆదేశించారు. సభ్యురాలి ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం శ్రీనిధి బ్యాంక్ ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. మహిళా మార్ట్‌కు సంబంధించి ప్రణాళిక ప్రకారం సంఘ సభ్యులందరి భాగస్వామ్యంతో వ్యాపారాన్ని ప్రారంభించాలని సూచించారు. సంఘ సభ్యులు ఏర్పాటు చేయనున్న యూనిట్లకు బ్యాంక్‌ల సూచనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం. కూర్మారావు, ఏరియా కోఆర్డినేటర్ రవికుమార్, డీపీఎం నారాయణరావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, సైకిళ్ల పంపిణీ

ఆమదాలవలస: స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో రోటరీ క్లబ్, ఆమదాలవలస టౌన్ వారి ఆధ్వర్యంలో గురువారం పేదలకు 36 కుట్టు మిషన్లు, 16 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కూన రవి కుమార్ అందజేశారు. రోటరీ క్లబ్‌కు కమ్యూనిటీ హాల్ కట్టడానికి ప్రభుత్వం తరఫున సహాయం అందిస్తామని తెలిపారు.సేవారత్న అవార్డులను పొందిన జలుమూరు వెంకటేశ్వరరావు, పాత్రుని పాపారావు, వి.టి.చౌదరిని అభినందించారు. రోటరీ కార్యదర్శి జలుమూరు రవిబాబు, రోటరీ సభ్యులు, కార్యకర్తలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థి బుడుమూరు శ్రీనివాసరావు వితరణగా అందజేసిన ఐదు కంప్యూటర్లతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పూర్వ విద్యార్థి ఇటువంటి సాయం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎ.స్వామి, అధ్యాపకులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోదుగువలస కాలనీలో పూడికపోయిన డ్రైనేజీ



పారిశుద్ధ్యం.. అధ్వానం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. పలు గ్రామాల్లో డ్రైనేజీల్లేక వాడుకనీరు, వర్షం నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోతుండటంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపింప జేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మోదుగువలస కాలనీ, దొంకలబడవంజ, జాంబాడ, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట, దబ్బపాడు, కృష్ణాపురం, సుమంతాపురం, ముంగెన్నపాడు, గొట్టిపల్లి, కొమ్మువలస తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అద్వానంగా ఉందని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు.

జ్వరాల బారిన ప్రజలు



వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడిన కుద్దిగాం వాసి

కొత్తూరు: మండలంలోని కుద్దిగాం, బమ్మిడి, కర్లెమ్మ, మాకవరం, నివగాం, మహర్తాపురంతో పాటు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వారం రోజుల క్రితం కుద్దిగాంలో ప్రతి ఒక్కరూ జ్వరం బారినపడ్డారు.

జగనన్న పాలనలోనే గిరిజన గ్రామాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని, గిరిజనులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలు చేశారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పోడు భూములు పండించే గిరిజన రైతులకు భూహక్కు పట్టాలు ఇవ్వడంతోపాటు రైతు భరోసా వర్తింపజేశారని, బ్యాంకుల నుంచి పంట రుణాలు ఇచ్చారని గుర్తుచేశారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 6 వేల మంది గిరిజన రైతులకు 9 వేల ఎకరాల ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు అందజేశామన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో రూ.12 కోట్ల ఖర్చుతో ఏకలవ్య రెసిడెన్సియల్ మోడల్ స్కూల్ భవనం నిర్మాణం పనులు ప్రారంభించామని వివరించారు. ఉత్తరాంధ్రలో అత్యంత ఎత్తైన (గిరిశిఖరాన ఉంటున్న) చందనగిరి, కేరాసింగి, కేరాసింగి గూడలకు రోడ్లు నిర్మించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గిరిజన గ్రామాల్లోకి వ్యాన్లు ద్వారా రేషన్ సరుకులు అందించామన్నారు. నియోజకవర్గంలో 201 గిరిజన గ్రామాలకు రూ.6.17కోట్ల ఖర్చుతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. అనేక మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇవ్వటంతోపాటు జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేసి ఓ ఇంటివారని చేశామన్నారు. గిరిజనుల కోసం మన రాష్ట్రంలో రూ.834 కోట్లు ఖర్చుతో గిరిజన కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సారవకోట: మండలంలోని బొంతు ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ నిర్వహణ పనులు చేయనున్నట్లు విద్యుత్ శాఖ టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు గురువారం తెలిపారు. బురుజువాడ, అర్లి, కోనవానిపేట, అన్నుపురం, వాబ, చిన్నగుజ్జువాడ, పెద్దగుజ్జువాడ తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

హిరమండలం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తులగాం ఫీడర్‌లో శుక్రవారం చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు గురువారం తెలిపారు. గొట్ట, తుంగతంపర, చొర్లంగి, కల్లట, భగీరథిపురం, ఎంఎల్‌పురం, అక్కరాపల్లి, పింద్రువాడ, కిట్టలపాడు, రెల్లివలస, గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

నరసన్నపేట: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుకు మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ ఆరంగి మురళి గురువారం ప్రారంభించారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు అధికారులు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాయతీల్లో వనరుల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించాలన్నారు. ఇతర ఆర్థిక వనరులను అభివృద్ధి చేయాలని, ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఉకలాం పంచాయతీ కార్యదర్శి ముకుందరావు, ఉర్లాం, జమ్ము, యారబాడు సర్పంచ్‌లు పోలాకి నర్సింహమూర్తి, వాన గోవిందరావు, యాబాజీ రమేష్ పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: పంచాయతీ పాలనలో సర్పంచ్‌లే కీలకమని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు. పంచాయతీ చట్టాలపై అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఈఓపీఆర్డీ పద్మజ, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

హిరమండలం: పంచాయతీ స్థాయిలో వార్షిక ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీఓ స్వరూపారాణి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ప్రజోపయోగ పనులకు పెద్దపీట వేస్తూ ప్రణాళికలు రూపొందించుకొవాలన్నారు. ఈఓపీఆర్డీ నాగమణి పాల్గొన్నారు.

పాతపట్నం:పంచాయతీలను ఆదర్శంగా తీర్చుదిద్దుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వార్షిక కార్యాచరణ ప్రణాళిక శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. 2024-25లో శానిటేషన్, వీధిలైట్లు, చెత్తసంపద కేంద్రాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు పాల్గొన్నారు.

జలుమూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం సాయపడాల ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు వారి విధులు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా..

సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయంలో 3 రోజుల పాటు నిర్వహించాల్సిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం మొదటి రోజే తుస్సుమంది. మండలంలో 21 మంది సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ ఇవ్వాలి. మొదటిరోజు శిక్షణకు రిసోర్స్‌పర్సన్, ఈఓపీఆర్డీ హాజురుకాలేదు. కోర్స్ డైరెక్టర్‌గా ఎంపీడీఓ, సహాయ కోర్స్ డైరెక్టర్‌గా ఈఓపీఆర్డీ వ్యవహరించి పర్యవేక్షణ చేయాలి. ఉదయం 11 గంటలకు ముగ్గురు సర్పంచ్‌లు, ఇద్దరు ప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. లంచ్ సమయానికి మరో ముగ్గురు హాజరయ్యారు. మిగినవారు హాజరుకాలేదు. మూడు రోజులపాటు హాజరైనట్లు ఒక్కసారే సంతాకాలు తీసుకోవడంపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన ప్రతీ సర్పంచ్‌కు సిటింగ్ చార్జీ కింద రోజుకు రూ.100 చెల్లించాలి. రిసోర్స్ పర్సన్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు భోజన సదుపాయం కల్పించాలి. ఎల్ఈడీ తెరపై వేసి రెండు అంశాలు చెప్పారే తప్ప.. అధికారులు మౌఖికంగా వివరించలేదని సర్పంచ్‌లు తెలిపారు.